క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడిగా మాకినేని



కాకుమాను: పెదనందిపాడు మండలంలోని అబ్బినేనిగుంట పాలెం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా మాకినేని సదాశివరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. గతంలో ఆయన టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషించి గత నాలుగు రోజుల క్రితం పార్టీ మండల కన్వీనర్ ఖాసీం పీరా ఆధ్వర్యంలో తన అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం రాత్రి సదాశివరావును గ్రామ పార్టీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు సదాశివరావును అభినందించారు.

నర్సింగ్ ఫలితాల్లో వేజండ్ల విద్యార్థిని ప్రతిభ



గేరా అక్షర

చేబ్రోలు: ఏఎన్ఎమ్ నర్సింగ్ పరీక్షా ఫలితాల్లో చేబ్రోలు మండలం వేజండ్ల సెయింట్ జోసఫ్స్ నర్సింగ్ స్కూలు విద్యార్థిని గేరా అక్షర 92 శాతం మార్కులతో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎస్ మమత శనివారం తెలిపారు. రెండు రోజుల క్రితం విడుదలైన నర్సింగ్ పరీక్షా ఫలితాల్లో వేజండ్ల గ్రామంలోని సెయింట్ జోసఫ్స్ ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ స్కూల్‌లో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గేరా అక్షర 600 మార్కులకు గానూ 551 మార్కులతో రాష్ట్రంలోనే అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. తమ నర్సింగ్ స్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరిలో ఐదుగురు 500 పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్ మమత, జయశీల, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదకాకాని: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలోని మౌర్యబార్ రెస్టారెంట్ వద్ద చోటు చేసుకుంది. గత మూడు రోజులుగా మద్యం సేవిస్తూ హిందీలో మాట్లాడుతున్న వ్యక్తి ఆ ప్రాంతంలో కనిపించారు. శుక్రవారం సాయంత్రం అపస్మారక స్థితిలోకి చేరుకుని మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు వీఆర్వో షేక్ రసూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ కె వీరాస్వామి తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఆప్‌కు డాక్టర్ సేవకుమార్ రాజీనామా

గుంటూరు మెడికల్: గత దశాబ్ద కాలంగా ఆమ్ ఆద్మీ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా వివిధ రాష్ట్రస్థాయి పదవులు నిర్వహించిన డాక్టర్ తాతా సేవ కుమార్ ఆమ్‌ఆద్మీ పార్టీకి రాజీనామా చేశారు. ఎన్నికలలో పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోటీ చేయనందున, తాను తప్పనిసరిగా మూడోసారి పోటీ చేయాలని నిర్ణయించుకున్నందువల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు పార్టీ తనకు కల్పించిన అవకాశాలకు ధన్యవాదాలు తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తు గురించి త్వరలో ప్రకటిస్తానన్నారు.

దక్షణాముఖ ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షణాముఖ ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి అర్చకులు వంశీకృష్ణ పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించి, భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీసీ రిజర్వేషన్ల అమలులో కేంద్రం విఫలం

నెహ్రూనగర్: బీసీల రిజర్వేషన్లు అమలు చేయడంలో కేంద్రం విఫలం చెందిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకుని రింగ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల స్థితిగతులపై అధ్యయనం చేసి 40 అంశాలను ఆనాడు కేంద్రానికి పంపితే ఇంతవరకు అమలు చేయలేదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా బీపీ మండల్ ప్రతిపాదించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాల నాయకులు జీఆర్ భగత్ సింగ్, సాంబయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి..

- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలులో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌కు మళ్లీ పట్టం గట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలంలోని గొల్లపాలెం, పరిసర ప్రాంతాల్లో ఆయన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. స్థానిక గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, సమస్యలను తెలుసుకుంటూ ముందుకు వెళ్లారు. అవ్వా, తాతలతో కలిసి ముచ్చటించారు. మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. ఎన్నికల ప్రచారంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న వైఎస్సార్ సీపీను మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చేబ్రోలు నాగేశ్వరరావు, అల్లం వెంకట్రామయ్య, పెశ్లూరి సుబ్బారావు, ఉగ్గం పున్నారావు, గమనీడు నాగేంద్రుడు, అంకం సూరిబాబు, షరీఫ్, చందు సాంబశివరావు, కొక్కిలగడ్డ కిరణ్ కుమార్, బి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలులో మురళీకృష్ణకు హారతి పడుతున్న మహిళలు



బీపీ మండల్ ఆశయ సాధనకు కృషి



బీపీ మండల్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: రిజర్వేషన్ల సాధకుడు, బీసీల ఆశాజ్యోతి, మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ వర్థంతి సందర్భంగా అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం వద్ద డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్ పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల వారికి న్యాయం జరగాలంటే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని భావించి దేశమంతా తిరిగి బీసీల స్థితిగతులపై అధ్యయనం చేసిన మహనీయుడు బీపీ మండల్ అని తెలిపారు. ఆయన అధ్యయనం చేసి అప్పటి ప్రధానికి నివేదిక ఇచ్చారన్నారు. నాడు ఆయన పోరాట ఫలితం నేడు మనం అనుభవిస్తున్న రిజర్వేషన్లని తెలిపారు. బీపీ మండల్ విగ్రహ కమిటీ కో కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆనాడు బీపీ మండల్ 40 అంశాలను ప్రతిపాదిస్తే వాటిలో కేవలం రెండు అంశాలు మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో మాత్రమే సిఫార్సులు అమలు చేస్తున్నారన్నారు. మిగిలిన సిఫార్సులను ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బి రామచంద్ర యాదవ్, దాసరి శివకుమార్, వాసు, పేరయ్య, జూపూడి శ్రీనివాసరావు, బత్తుల వీరాస్వామి, ఎస్ రామారావు, ఎస్ రాంబాబు, టి నరశింహారావు, ఏ రామకృష్ణ, ఎమ్ సుబ్బారావు, భగత్ సింగ్, సాంబశివరావు, మహాలక్ష్మి తదితరులున్నారు.

ప్రారంభమైన హ్యాక్‌ఫెస్ట్ రీజినల్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న టీంలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఫెస్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో 'హ్యాక్‌ఫెస్ట్ 2024' రీజినల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు రియల్ వరల్డ్ సమస్యలకు ఇన్నోవేటివ్ ఐడియాలను గుర్తించి వాటిని ప్రదర్శించటానికి ఇలాంటి జాతీయ స్థాయి ఫెస్ట్‌లను శాప్ సంస్థ నిర్వహిస్తుందన్నారు. ఎల్ వెంకటరామన్ మాట్లాడుతూ సాంకేతిక విద్యా మండలి ప్రస్తుతం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను అధిగమించటానికి సాంకేతికత మరింత అభివృద్ధి చెందాలన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిశ్రమలకు అవసరమైన విధంగా తమ కళాశాలలో విద్యాబోధన, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే సౌకర్యాలను కల్పించటం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 30 కళాశాలలకు చెందిన 75 టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ బాలాజీ, డాక్టర్ కె రామారావు, డాక్టర్ వై రాకేష్‌కుమార్ విద్యార్థులు తదితరులున్నారు.

సెబ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జాయింట్ కమిషనర్



స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సెబ్ జాయింట్ కమిషనర్ బత్తుల అరుణ్‌రావు

నగరంపాలెం: మద్యరహిత ఎన్నికల నిర్వహణకు ఆకస్మిక తనిఖీలు కొనసాగించాలని సెబ్ జాయింట్ కమిషనర్ బత్తుల అరుణ్‌రావు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని గుంటూరు-1 స్టేషన్‌లో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టేషన్ పరిధిలోని నేరాలకు సంబంధించి రికార్డులు, పాత కేసులు, బైండోవర్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఆకస్మిక తనిఖీలు, అక్రమ మద్యం నిల్వలు, వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. జాయింట్ కమిషనర్ వెంట సెబ్ జిల్లా ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, ఏఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, గుంటూరు-1 స్టేషన్ సీఐ పి.విజయ్‌కుమార్, హెడ్ క్వార్టర్స్ ఏఈఎస్ జి.నరసింహారావు ఉన్నారు.

మాంటిస్సోరి పూర్వ విద్యార్థినికి అభినందన



తేజస్వినిని అభినందిస్తున్న కేవీ సెబాస్టియన్, మంజు

గుంటూరు ఎడ్యుకేషన్: జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 464 సాధించిన మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ పూర్వ విద్యార్థిని ఎస్. తేజస్వినిని పాఠశాల డైరెక్టర్ కేవీ సెబాస్టియన్, కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ అభినందించారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో సెబాస్టియన్ మాట్లాడుతూ ప్రీ కేజీ నుంచి టెన్త్ వరకు తమ పాఠశాలలోనే చదివిన తేజస్విని టెన్త్‌లో 582 మార్కులు సాధించినట్లు వివరించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మంజు సెబాస్టియన్ మాట్లాడుతూ ప్రతిభావంతురాలిగా ఎదిగిన తమ పూర్వ విద్యార్థిని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూసిన సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కులందై ట్రీజా అభినందించారు. శనివారం అమరావతిరోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రథమ సంవత్సరంలో 95 శాతం, ద్వితీయ సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. సీనియర్ బైపీసీలో ఎస్.స్వప్నశ్రీ 983, డి.వరలక్ష్మి 962, మౌనిక 961, ఎంపీసీలో షేక్ సమీరా 972, వి.భవ్యశ్రీ 967, జి.సాయి సుప్రియ 945, సీఈసీలో ఐ.హరివల్లిక 960 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఎంపీసీలో వి.చాతుర్య 458, డి.రమ్య 457, డి.లావణ్య 456. బైపీసీలో టి.జాయిస్ 403, సీఈసీలో ఎం.అక్షయ 450, జి.నికిత 439 మార్కులు పొందినట్లు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థినులను సిస్టర్ ట్రీజాతో పాటు అధ్యాపకులు అభినందించారు.

విప్పటం, వడ్డేశ్వరం ప్రజల వీరాభిమానం

ఎండను సైతం లెక్క చేయక రోడ్డెక్కిన జనం



పెదకాకాని, పిడుగురాళ్ళ రూరల్: మండే ఎండలను సైతం లెక్క చేయకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శనివారం విప్పటం, వడ్డేశ్వరం ప్రాంతానికి చేరుకునే సరికి ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయికి స్వాగతం పలికారు. అందరికీ అభివాదం చేస్తూ జననేత ముందుకు సాగారు. పార్టీ జెండాలు, కండువాలతో కేరింతలు కొడుతూ ఎండకు సైతం లెక్క చేయకుండా ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

కంతేరు అడ్డరోడ్డులో అభిమానుల కోలాహలం

పెదకాకాని: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర పెదకాకాని మండలంలోని నంబూరు శివారు కంతేరు అడ్డరోడ్డుకు చేరుకునే సరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేసేందుకు పెద్ద ఎత్తున నాయకులు, ప్రజలు అక్కడికి చేరుకున్నారు. తమ అభిమాన నేతకు ప్రత్యేకంగా తయారు చేయించిన గజమాలను క్రేన్ సహాయంతో వేసేందుకు సిద్ధం చేశారు. బస్సు నుంచి కిందికి దిగిన సీఎం అభిమానులను పలుకరిస్తూ అభివాదం చేశారు. పేదలకు, పెత్తందార్లకు జరుగుతున్న యుద్ధంలో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుని మాదిరిగా సిద్ధం కావాలని వారిలో ఉత్సాహాన్ని నింపారు. యువత సెల్‌ఫోన్లతో ఫోటోలు, వీడియోలు తీస్తూ సీఎం సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: విద్యుదఘాతానికి గురై వ్యక్తి మృతిచెందిన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బృందావన్‌గార్డెన్స్‌లోని విజయ కాంప్లెక్స్‌లో లియో గ్లోబల్ సర్వీసెస్ సంస్థ నిర్వహిస్తున్నారు. శుక్రవారం వర్షం కారణంగా విద్యుత్ వైర్లు ఎర్త్ అయ్యాయి. కార్యాలయంలో శనివారం మొదట ఓ ఉద్యోగి ల్యాండ్‌లైన్ ఫోన్ పట్టుకుని స్వల్ప విద్యుదఘాతానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న లియోగ్లోబల్ సంస్థ ఎండీ లగడపాటి వీరాంజనేయులు (38) తాను టెలిఫోన్ పట్టుకుని పరిశీలిస్తూ.. తీవ్ర విద్యుదఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్‌పై దాడి దుర్మార్గం

సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు

నెహ్రూనగర్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక స్వార్థపరులు ఆయనపై దాడికి పాల్పడ్డారని సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ రాష్ట్రంలోనే కాక దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఆకర్షిస్తూ వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూడలేక ఆయనపై దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

రూ.1.76 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా రూ.1.76 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. గోరంట్ల గ్రామానికి చెందిన దాడి శివబాబు కారులో వెళుతుండగా తనిఖీలు చేయగా ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకొని ఐటీ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

పోలేరమ్మ తిరునాళ్లకు సీఎంకు ఆహ్వానం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆహ్వాన పత్రికను అందజేసిన కమిటీ చైర్మన్ కంఠమనేని



తిరునాళ్ల ఆహ్వాన పత్రికను సీఎం వైఎస్ జగన్‌కు అందజేస్తున్న కంఠమనేని నరేష్‌బాబు

కాకుమాను: మండలంలోని కొండపాటూరు గ్రామంలో వేంచేసి యున్న స్వయంభూ శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాన్ని ఈ నెల 30న నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఉత్సవ కమిటీ చైర్మన్ ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం నంబూరులో 'మేము సిద్ధం' బస్సు యాత్రలో ఉన్న ముఖ్యమంత్రిని ఉత్సవ కమిటీ చైర్మన్ కంఠమనేని నరేష్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించేందుకు పోలేరమ్మ తల్లి ఆశీర్వాదాలు అందరిపై మెండుగా ఉండాలని నరేష్ బాబు ఆకాంక్షించారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

- రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్న ప్రభుత్వం కొలువు దీరేందుకు కృషి చేద్దాం
- ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం

గుంటూరు రూరల్: జగనన్నే మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆయన ద్వారానే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని వికాస్‌నగర్ నందు ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, లీగల్‌సెల్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జగనన్న అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన చేశారన్నారు. తద్వారా ప్రతి కుటుంబం నేడు ఆర్థికంగా అభివృద్ధి చెంది సంతోషంగా జీవిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాడన్నారు. మోస పూరిత హామీలు ఇచ్చి గతంలో ఆయన ప్రజలను మోసం చేసిన వైనాన్ని గుర్తు చేశారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయి నాయకులు ప్రతి ఇంటికి తిరిగి ప్రతి కుటుంబానికి జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, చేసిన మేలును వివరించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు మరోసారి జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ప్రత్తిపాడు నియోజకవర్గంలో తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమాజాన్ని కదిలించేది కవిత్వమే

గుంటూరు రూరల్: సమాజాన్ని కందిలించేది కవిత్వమేనని 'నేటి నిజం' సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. శనివారం మండలంలోని పొత్తూరు నందున్న సాహితీకిరణం బ్రాంచి కార్యాలయంలో క్రోధినామ సంవత్సర ఉగాది సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాభివృద్ధికి కవిత్వం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తూములూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మాతృభూమి, మాతృభాషను ఎన్నటికీ మరిచిపోరాదన్నారు. కేవీఎల్ఎన్ ప్రసన్నకుమారి రచించిన 'సాహితీ సంకలనం', 'ఆలోచనల ఆవిష్కరణ' అనే పుస్తకాలను పొత్తూరి సుబ్బారావుతో కలిసి ఆవిష్కరించారు. తన కుమార్తె పేరిట తాను కథల పోటీలు నిర్వహిస్తూ సాహితి సేవ చేస్తున్నానని విడదల సాంబశివరావు పేర్కొన్నారు. వడలి రామకృష్ణ సాహిత్యానికి ఉన్న విలువలను తెలిపారు. తంగిరాల చక్రవర్తి బహుమతులు పొందిన కథలను వెల్లడించారు. పొత్తూరు జయలక్ష్మి ఆవిష్కరించిన రెండు పుస్తకాలను సమీక్షించారు. సాహితీ సంకలనం పుస్తకాన్ని కెవిఎన్ఎస్‌వి ప్రసాద్ అంకితంగా స్వీకరించారు. శ్రీ కార్తీక డెవలపర్స్ సౌజన్యంతో నిర్వహించిన ఉగాది కవితల పోటీలలో విజేతలైన పరిమి వెంకటసత్యమూర్తి, పొత్తూరు సీతారామారాజు, కె కాశింబి, కోనేటి నరేష్, నిహారిక ఫౌండేషన్ సంక్రాంతి కథల పోటీ విజేతలు ఉయ్యూరు అనసూయ, సీహెచ్‌సీ శర్మ, సూరిశెట్టి వసంతకుమార్, మట్టూరి కమలమ్మ ఫౌండేషన్ చిన్న కథల పోటీల విజేతలు కృపాకర్, పాణిగ్రాహి రాజశేఖర్, కట్టా రాంబాబులను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ జానీబాషా, పోచిరాజు పావనిశ్రీ, పెద్దూరి వెంకటదాసు, ఎస్ఎమ్ సుబాని, బడికల్లు జమదగ్ని, బుర్రి కుమార్‌రాజు, తాటికోల పద్మావతి, అంజనేయులు పాల్గొన్నారు.

క్రీస్తుని నామంతో ప్రశాంత జీవనం



ప్రార్థనలో పాల్గొన్న మంత్రి విడదల రజని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దొక్కా మాణిక్య వరప్రసాద్

కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్

గుంటూరు రూరల్: క్రీస్తుని నామంలో విజయం కలుగుతుందని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. గత మూడు రోజులుగా నల్లపాడు రోడ్డులో జరుగుతున్న సువార్త ఉజ్జీవ మహాసభలు శనివారం కొనసాగాయి. ఉదయం ప్రత్యేక ప్రార్థనల్లో ముందుగా కృపా మినిస్ట్రీస్ బ్రాంచ్‌లకు చెందిన పాస్టర్లు క్రీస్తుని నామాన్ని ఘనపరుస్తూ స్తుతి గీతాలు ఆలపించారు. బ్రదర్ మాథ్యూస్ క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందిస్తూ ఏసు క్రీస్తు లోకంలోని పాపుల పాపాలను కడిగేందుకు జన్మించాడన్నారు. ఆయన రక్తంతో పాపుల పాపాలను కడగల పవిత్రమైన దేవుడు క్రీస్తని తెలిపారు. క్రీస్తుని నమ్మి ఆయన సన్మార్గంలో నడిస్తే ఎటువంటి ఆటంకాలు లేకుండా జీవితం ప్రశాంతంగా సాగుతుందన్నారు. పాస్టర్ బోగి శాంతారావు, వినయ్ మాథ్యూస్‌లు క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో 18వ వార్షిక ప్రత్యేక ప్రార్థనల నూతన స్తుతి గీతాలు ఆలపించారు. ఉదయం, సాయంత్రం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో లక్షలాదిగా క్రీస్తుని భక్తులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రత్యేక ప్రార్థనలు ముగుస్తాయని మినిస్ట్రీస్ ప్రతినిధులు తెలిపారు.